క్లుప్తంగా

మోడేకుర్తికి పోలీసుల సత్కారం


మోడేకుర్తిని సత్కరిస్తున్న పోలీసులు

గాజువాక : ఇటీవల నిర్వహించిన సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి గిరి ప్రదక్షిణ సందర్భంగా విశ్రాంత ఉక్కు ఉద్యోగి, రచయిత, మోడేకుర్తి వీర వెంకట సత్యనారాయణ అందించిన సేవలకు గాను గోపాలపట్నం పోలీసులు ఆయనను ఘనంగా సత్కరించారు. గిరి ప్రదక్షిణ సందర్భంగా తొలి పావంచా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మైక్‌ద్వారా 24 గంటలపాటు స్వచ్ఛందంగా భక్తులకు సూచనలు, జాగ్రత్తలను చెప్పడంతోపాటు తప్పిపోయినవారి వివరాలను అందిస్తూ అనౌన్సర్‌గా సేవలందించారు. ఈ సేవలకు గాను గోపాలపట్నం సీఐ ఎస్‌వీ ప్రభాకర్ తదితరులు ఆయన్ని సత్కరించి అభినందనలు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నిక పత్రాలను అందజేస్తున్న ప్రతినిధులు

గాజువాక : గాజువాక ఆర్యవైశ్య సంఘానికి నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం నూతన అధ్యక్ష కార్యదర్శులుగా తాళ్లూరు మల్లేశ్వరరావు, కార్యదర్శిగా కులుకూరి మంగరాజు, కోశాధికారిగా కేశారపు సతీష్, గౌరవాధ్యక్షుడిగా పీపీఎస్ నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల అధికారి నూతన ప్రతినిధులకు ఎన్నిక పత్రాలను అందజేశారు.

సంక్రాంతికి టిడ్కో గృహాలు


మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్

పెదగంట్యాడ: వచ్చే సంక్రాంతికి టిడ్కో గృహాలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని భానోజీతోటలో నిర్మించిన టిడ్కో గృహాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గృహాల నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు వాటికి అవసరమైన మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి వసతులు కల్పించి సంక్రాంతి పండగ నాటికి లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, నాయకులు గంధం వెంకటరావు, కసిరెడ్డి సత్యనారాయణ, తిప్పల రమణారెడ్డి, రట్టి వాసు, గడసాల అప్పారావు, రెయ్యి రత్న తదితరులు పాల్గొన్నారు.

విమల విద్యాలయం తక్షణం ప్రారంభించాలి


ఉక్కు విమల విద్యాలయం వద్ద నిరసన ప్రదర్శిస్తున్న కార్పొరేటర్, నాయకులు

ఉక్కునగరం: విశాఖ విమల విద్యాలయాన్ని తక్షణమే తిరిగి ప్రారంభించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. విమల విద్యాలయం తెరవాలనే డిమాండ్‌తో జరుగుతున్న నిరసన దీక్షలు గురువారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి.ఈ దీక్షలో పాల్గొన్న డాక్టర్ గంగారావు మాట్లాడుతూ, సుమారు 1600 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలను మూసివేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. విశాఖ ఎంపీ, స్థానిక ఎమ్మెల్యేలు బాధ్యతాయుతంగా వ్యవహరించి పాఠశాల పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి పాఠశాలను తిరిగి తెరిచేలా కూటమి ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై.టి. దాస్, యు. రామస్వామి, శ్రీనివాసరాజు, ఎన్. రామారావు, వి.వి. రమణ, వేణు, సుమ, విజయలక్ష్మి, ప్రభ, ఉష తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో స్టీల్ క్లబ్



స్టీల్‌క్లబ్ ముఖ ద్వారం

ఆహ్లాదం..వినోదం
సౌకర్యాల విస్తరణ
క్లబ్‌తో మానసిక ఉల్లాసం

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ కింది స్థాయి అధికారుల కోసం ఏర్పాటు చేసిన స్టీల్ క్లబ్, అనేక సౌకర్యాలు, సదుపాయాల విస్తరణతో నూతన శోభను సంతరించు కుంది. ఉద్యోగుల విధి నిర్వహణలోని ఒత్తిడిని దూరం చేసి, మానసిక ఉల్లాసాన్ని అందించే లక్ష్యంతో ఈ క్లబ్ నిరంతరం అభివృద్ధి చెందుతోంది.

స్టీల్ ప్లాంట్ ఆవిర్భావ దశలో, అధికారుల వినోదం కోసం సెక్టార్-5లో ఉక్కునగరం క్లబ్ స్థాపించారు. కాలక్రమేణా కార్మికులు కింది స్థాయి అధికారులుగా పదోన్నతి పొందినప్పుడు, అప్పటికే ఉన్న ఉన్నతాధికారుల క్లబ్‌లో వారికి సభ్యత్వం లభించలేదు. ఈ లోటును పూడ్చేందుకు, ప్లాంట్ ప్రారంభంలో రష్యన్‌ల కోసం నిర్మించిన భవనాన్ని యాజమాన్యం స్టీల్ క్లబ్‌గా మార్చింది.

అభివృద్ధికి బాటలు


థియేటర్‌లో ఆధునీకరించిన లైటింగ్

స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) చీఫ్ పాట్రన్‌గా, సీనియర్ అధికారి అధ్యక్షతన ప్రతీ ఏడాది ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల ద్వారా క్లబ్ పాలకవర్గం ఏర్పాటవుతుంది. ప్రతీ కమిటీ క్లబ్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తోంది. థియేటర్‌లో కొత్త సీట్లు ఏర్పాటు చేయడంతో పాటు, వినూత్న లైటింగ్‌తో థియేటర్‌ను ఆధునీకరించారు. మూతపడిన రెస్టారెంట్‌ను ఆధునీకరించి తిరిగి తెరవడంతో, సభ్యులకు, ఉక్కునగర వాసులకు సౌకర్యవంతంగా మారింది.

సౌకర్యాల విస్తరణ – సంపూర్ణ వినోదం

స్టీల్ క్లబ్ ప్రస్తుతం అత్యాధునిక సౌకర్యాలతో సభ్యులను ఆకట్టుకుంటోంది. సెంట్రలైజ్డ్ ఏసీ థియేటర్లో ప్రతీ వారం రెండు రోజులకు సినిమాలు ప్రదర్శిస్తారు. ఇది సాంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు కూడా వేదికగా నిలుస్తుంది. ఉద్యోగులు తమ పిల్లల ఫంక్షన్లు, వివాహాలు వంటి శుభకార్యాలకు కూడా దీనిని ఉపయోగించుకోవచ్చు.

సువిశాల గ్రంథాలయం : దినపత్రికలు, వార, మాస పత్రికలు, నవలలతో కూడిన గ్రంథాలయం సభ్యులకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తోంది.

ఇండోర్, ఔట్‌డోర్ క్రీడలు: చదరంగం, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి ఇండోర్ క్రీడలతో పాటు, స్విమ్మింగ్ పూల్ కూడా అందుబాటులో ఉంది.

కళావేదిక నిర్మాణం: థియేటర్ చిన్నది కావడంతో, వివాహాలు, శుభకార్యాల నిర్వహణకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు క్లబ్ ఆవరణలో విశాలమైన కళావేదికను నిర్మించారు.

మహిళల కోసం బ్యూటీ పార్లర్: మహిళల సౌకర్యార్థం క్లబ్ ఆవరణలో బ్యూటీ పార్లర్‌ను ఏర్పాటు చేశారు.

చిల్డ్రన్ పార్క్: పిల్లల వినోదం కోసం క్లబ్ ముందు భాగంలో చిల్డ్రన్ పార్క్‌ను నిర్మించారు.

మెరుగైన పార్కింగ్: క్లబ్ ఆవరణ చుట్టూ తారు రోడ్లు వేయడం ద్వారా పార్కింగ్ సదుపాయాలు గణనీయంగా మెరుగుపడ్డాయి.

ప్రస్తుత కమిటీ - నూతన మైలురాళ్లు

ప్రస్తుత కమిటీ హయాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేసింది. సాంస్కృతిక కార్యక్రమాలు, వివాహాలకు అవసరమైన గ్రీన్ రూమ్‌ను ఆధునీకరించారు. కొంతకాలం నిలిచిపోయిన స్విమ్మింగ్ పూల్‌ను కూడా ఆధునీకరించారు. సభ్యులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం క్లబ్‌లోని జిమ్‌ను విస్తరించి, అధునాతన యంత్రాలను ఏర్పాటు చేశారు. స్టీల్ క్లబ్‌లో జరుగుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఉద్యోగుల మానసిక ఉల్లాసాన్ని పెంచి, వారి దైనందిన జీవితంలో ఉత్సాహాన్ని నింపుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.


క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్

యాజమాన్యం సహకారంతోనే అభివృద్ధి



స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సహకారంతోనే స్టీల్ క్లబ్ అభివృద్ధి జరుగుతోంది. క్లబ్ సభ్యుల అహ్లాదం కోసం వివిధ కార్యక్రమాలు చేపట్టాం. భవిష్యత్తులో సభ్యుల మానసిక ఉల్లాసం కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నాం. అదే విధంగా పలు సదుపాయాల కల్పనకు రూపకల్పన చేస్తున్నాం.

– పెంటకోట రామకృష్ణ, స్టీల్‌క్లబ్ కార్యదర్శి

అల్లేసినా.. పట్టించుకోరా..?


విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పొదలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని గాంధీనగర్‌లో విద్యుత్ స్తంభాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మండలంలో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలకు కింద నుంచి పైవరకూ దట్టమైన పొదలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. నిర్వహణ పనుల పేరుతో వారంలో ఒక రోజు గంటల తరబడి విద్యుత్‌ను నిలిపివేస్తున్నా, ఇలాంటి చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కారం కాకపోవడంపై స్థానిక వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలు పూర్తిగా కనిపించనంతగా పొదలు అల్లుకుపోవడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతున్నాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ఈ పొదల కారణంగా విద్యుత్ షాక్‌లు, షార్ట్ సర్క్యూట్‌లు వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి, విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న ఈ పచ్చటి పొదలను తొలగించి, ప్రమాదాలను నివారించాలని గాంధీనగర్ ప్రజలు కోరుతున్నారు.

అంతర్జాతీయ చరిత్ర ఒలింపియాడ్‌కు అభినవ్‌రెడ్డి



దాబాగార్డెన్స్ : ప్యారిస్ నగరంలో ఈ నెల 19 నుంచి 27 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ చరిత్ర ఒలింపియాడ్‌లో నగరానికి చెందిన పన్నెండేళ్ల అభినవ్‌రెడ్డి భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇంటర్మీడియట్ విభాగంలో ఫైనల్స్‌లో పోటీపడుతున్న అభినవ్ దేశ వ్యాప్తంగా ఎంపికైన ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సవాల్‌కు సిద్ధమవుతున్న అభినవ్ ప్రయాణం యువ అభ్యాసకులకు ప్రేరణగా నిలుస్తోంది.

స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


రామచందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేం దుకు కృషి చేస్తానని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ హామీ ఇచ్చారు. గురువారం విశాఖ పర్యటనకు విచ్చేసిన ఆయనను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గత 12 ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు నిలిచిపోవడం వల్ల ప్లాంట్‌లో సీజీఎం (చీఫ్ జనరల్ మేనేజర్) స్థాయిలో ఎవరూ లేరని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఖ్య 4,500 నుంచి 2,500కు తగ్గిపోయిందని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ల ప్రకారం నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జేఈవో నుంచి ఏఈ (అసిస్టెంట్ ఇంజినీర్) పదోన్నతులు కల్పించాలని, తొలగించిన ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషన్ సభ్యుడు రామచందర్, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బాబు, ఎస్సీ లైజన్ ఆఫీసర్ నల్లి సుందరం, సెల్ ఆఫీసర్ ఎన్.ఎస్.ఆర్.ఎం. ప్రసాద్, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్యతో పాటు జి. సత్యనా రాయణ, ఎల్.వి. రమణ, ఎస్. మోహన్‌బాబు, ఎం. గణేష్, డి. పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ పాదయాత్ర



పాదయాత్ర నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సార్ట్‌మీటర్లను నిరసిస్తూ సీపీఎం నాయకులు గురువారం 68వ వార్డులో పాదయాత్ర నిర్వహించారు. వార్డులోని వివిధ కాలనీల్లో కరపత్రాలను పంపిణీ చేస్తూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు లోకేష్ మాట్లాడుతూ ఈ మీటర్లవల్ల విద్యుత్ బిల్లు అత్యంత అధిక మొత్తంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్ మాదిరిగా రీచార్జి చేసుకోవాలని, దీనివల్ల కరెంటు చార్జీలు కూడా భరించలేనంతగా పెరిగిపోతాయని అన్నారు. గత ప్రభుత్వం హయంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన నారా లోకేష్ తాము అధికారంలోకి రాగానే ఈ మీటర్లు పెట్టేందుకు ఉపక్రమించడం దుర్మార్గమన్నారు. ఇది ప్రజా వ్యతిరేక చర్య అని, దీన్ని అందరూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వనమాల అప్పలరాజు, ఎస్.జగన్నాథరావు, రమణమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భెల్‌ను సందర్శించిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు


రామచందర్‌ను సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

గాజువాక : జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ స్థానిక భెల్ హెచ్‌పీవీపీ యూనిట్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు భెల్ ఈడీ జి.సుబ్రమణ్యం, జనరల్ మేనేజర్ గౌరీ శంకర్, ఏజీఎం ఎస్.లీలా తదితరులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంపెనీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమస్యలపై చర్చించారు. ఇక్కడి సమస్యలను అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు వివరించారు. ఇద్దరు ఎస్సీ ఉద్యోగులు డీ గ్రేడ్ అయ్యారని, వారికి రావాల్సిన గ్రేడ్‌ను ఇప్పించాలని కోరారు. రిజర్వేషన్ ప్రక్రియ రోస్టర్‌పాయింట్‌ను సక్రమంగా అమలు చేయించాలన్నారు. స్థానిక సమస్యలపై చర్చించారు. అనంతరం రామచందర్‌ను అసోసియేషన్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు హెచ్.భోగేష్, బి.రాజ్‌కుమార్, డి.ఆదినారాయణ, ఎన్.బి.ప్రశాంత్ కుమార్, టి.సాంబశివరావు, అపురూప కుమార్, పి.విశ్వాసరావు, జి.ప్రసాద్, ఎస్.జయప్రకాస్ తదితరులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో సిటూ విశాఖ జిల్లా మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్

దాబాగార్డెన్స్: సిటూ విశాఖ జిల్లా 13వ మహాసభలు ఈ నెల 26, 27 తేదీల్లో కంచరపాలెం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. గురువారం సిటూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లలో జిల్లాలో నిర్వహించిన వివిధ కార్మిక పోరాటాలు, ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు, ఆందోళనలు రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్టు చెప్పారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, ఉద్యోగ భద్రత, అసంఘటిత రంగ కార్మికుల ఉపాధి రక్షణ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు, స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం, వివిధ షాపులు, హోటల్స్, హాస్పటల్స్‌లో పనిచేస్తున్న కార్మికులు, రోడ్డుపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్న చిల్లర వర్తకులు, ఆటో, మోటార్, రవాణా రంగ కార్మికుల హక్కుల గురించి, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ, పాత పెన్షన్ స్కీం అమలు తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు


కర్ఫ్యూను తలపించేలా పెదగంట్యాడ ప్రధాన రహదారి


నిత్యం రద్దీగా ఉండే ఇస్లాంపేట ప్రధాన రహదారి


ఎండ వేడికి గొడుగు వేసుకుని కళాశాలకు వెళ్తున్న విద్యార్థి

అల్లాడుతున్న ప్రజలు

పెదగంట్యాడ: సాధారణంగా జూలై నెలలో వర్షాలు కురుస్తాయి. కానీ ఈ ఏడాది భానుడు భగభగలు సృష్టిస్తూ, నిప్పులు కురిపిస్తున్నాడు. రోహిణి కార్తెను తలపించేలా ఉన్న ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. 'రోహిణి ఎండలకు రోళ్లు కూడా పగులుతాయి' అనే సామెతను గుర్తు చేస్తూ, ఈ ఏడాది జూలైలో ఉష్ణోగ్రతలు వేసవి కాలం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి.

కర్ఫ్యూ వాతావరణం, ఖాళీ రోడ్లు

ఎండల తీవ్రతకు సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 దాటితే చాలు ప్రధాన రహదారులపై జన సంచారం పూర్తిగా తగ్గిపోతోంది. రోడ్లపై జనం జాడ కనబడటం లేదు. చాలా మంది ఇళ్లకే పరిమితమై, సాయంత్రం అయితే గానీ బయటకు రావట్లేదు.

పర్యావరణ మార్పులే కారణం అంటున్న నిపుణులు

ఒకప్పుడు పచ్చని చెట్లతో కళకళలాడే ప్రాంతాలు ఇప్పుడు బోసిపోయాయి. అభివృద్ధి పేరుతో, విద్యుత్ తీగలకు తగులుతున్నా యనే కారణంతో అనేక చెట్లను నరికివేయడం పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే వాతావరణ మార్పులకు కారణమని వారు చెబుతున్నారు.

శీతల పానీయాలకు పెరుగుతున్న డిమాండ్

తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు శీతల పానీయాలపై ఆధారపడుతున్నారు. దీనితో కొబ్బరి బోండాలు, ఇతర శీతల పానీయాల ధరలు అమాంతం పెరిగాయి. రూ.30 ఉండే కొబ్బరి బోండం ఇప్పుడు రూ.50 నుంచి రూ.60కి అమ్ముడవుతోంది. ఇంట్లో ఉన్నా 24 గంటలూ ఫ్యాన్ లేకపోతే ఉండలేని పరిస్థితి నెలకొంది. ఈ అసాధారణ వాతావరణం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కళావిహీనంగా పార్కు


పార్కులో తిష్టవేసిన కుక్కలు


అభివృద్ధికి నోచుకోని కూర్మన్నపాలెం వుడాకాలనీ పార్కు


పార్కును పరిశీలిస్తున్న కాలనీ పెద్దలు

- ఓ వైపు ఆక్రమణల బెడద
- నిర్వహణ లేక కుక్కలు, పందుల సంచారం

కూర్మన్నపాలెం: అభివృద్ధి మాట దేవుడెరుగు.. పార్కు స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ విషయమై అక్కడి వారు ప్రజా ప్రతినిధులు.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కడం లేదు సరికదా అక్రమార్కుల నుంచి వేధింపులు, బెదిరింపులు ఎదురవుతున్నాయని నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి : కూర్మన్నపాలెంలోని వుడా ఫేజ్ 6 లేఅవుట్ 2002లో ఏర్పాటు చేశారు. వివిధ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, వ్యాపారులు సుమారు 30 మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. వారికి అనుకూలంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే అక్కడ ప్రజలకోసం దాదాపు 2.10 ఎకరాల భూమిని పార్కు నిమిత్తం వుడా కేటాయించింది. ఆ తర్వాత అభివృద్ధిని గాలికి వదిలేశారు. దీంతో కుక్కలు, పందులకు నిలయంగా మారిపోయింది. పార్కును అభివృద్ధి చేయాలని, ఆక్రమణలు తొలగించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దలు మరళీధరరెడ్డి .జి.మల్లికార్జునరావు తదితరులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. వాటిని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పలుకుబడి కలిగిన వ్యక్తి పార్కుకు సంబంధించిన కొంత స్థలాన్ని ఆక్రమించి భారీ భవంతిని నిర్మించేశాడని వారు పేర్కొన్నారు. సదరు యజమాని పార్కులో ఉన్న వాటర్ ట్యాంక్ కింద కుటీరం వేసి అక్కడే కుక్కలు పెంచుతున్నాడు. దీంతో పార్కుకు వెళ్తే కుక్కలు వచ్చి మీద పడతాయన్న భయంతో హడలిపోతున్నారు. ప్రజలు కాసేపు సేద తీర్చుకొనేందుకు దోహదపడాల్సిన పార్కు ఈ దుస్థితికి చేరిందని కాలనీ పెద్దలు కె.శ్రీనివాస్,పి.శ్రీధరవర్మ,ఎ.వి.జె.గోపాల్ జి.కుమార్,బి.బాలజీ,వి.వి.రామరాజు తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయాలని కోరారు. లేనిపక్షంలో కాలనీవాసులంతా కుటుంబాలతో కలసి ఆందోళనకు దిగుతామని వారు బుధవారం స్పష్టం చేశారు.

ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

మద్దిలపాలెం : కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవిందు డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా వెంకోజీపాలెం ఆంజనేయస్వామి విగ్రహం వరకు ఆటోలతో డ్రైవర్లు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం వాహన మిత్ర అమలుతోపాటు, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి సంవత్సర కాలం దాటిపోయినా పథకాలు అమలు చేయలేదన్నారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్నామన్నారు. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు జీవో. 21, 31 జారీ చేసిన ప్రభుత్వం డ్రైవర్లపై అక్రమ కేసులు బనాయిస్తూ వాహనాలను సీజ్ చేయించడం మానుకోవాలన్నారు.